ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు జిల్లా వార్తలు
సోమవారం 17 మార్చి 2025



రామకృష్ణ అంతిమయాత్ర



రామకృష్ణ (ఫైల్‌ఫోటో)

హంతకులను వదిలిపెట్టం

- వైసీపీ కార్యకర్త చేతిలో హత్యకు గురైన రామకృష్ణ కుటుంబీకులకు సీఎం హామీ
- అశ్రునయనాల మధ్య టీడీపీ కార్యకర్త అంత్యక్రియలు



చల్లా, షాజహాన్ బాషాకు హత్య జరిగిన తీరును వివరిస్తున్న రామకృష్ణ కుమారులు సురేశ్, శివ

పుంగనూరు,మార్చి16 (ఆంధ్రజ్యోతి): 'హంతకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. మీరు ధైర్యంగా ఉండండి' అని వైసీపీ కార్యకర్త వెంకట్రమణ చేతిలో హత్యకు గురైన టీడీపీ కార్యకర్త రామకృష్ణ కుటుంబీకులకు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ కృష్ణాపురంలో టీడీపీ కార్యకర్త కాగతి రామకృష్ణను వేటకొడవలితో వైసీపీ కార్యకర్త వెంకట్రమణ కిరాతకంగా హత్య చేసిన సంగతి తెలిసిందే. శనివారం రాత్రి అన్నమయ్య జిల్లా మదనపల్లె ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నుంచి రామకృష్ణ మృతదేహాన్ని స్వగృహానికి తరలించి ఆదివారం ఉదయం 12 గంటలకు అంత్యక్రియలు చేయాల్సి ఉంది.పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వచ్చి రామకృష్ణ మృతదేహంపై టీడీపీ జెండా కప్పబోగా కుటుంబీకులు నిరాకరించారు. తమకు న్యాయం జరిగేవరకు అంత్యక్రియలు నిర్వహించేది లేదన్నారు. కేవలం టీడీపీలో ఉన్నామన్న కారణంతోనే వైసీపీ ప్రభుత్వంలో తమ ఇంటిళ్లపాదీ వైసీపీ కార్యకర్తల చేతిలో దాడులు, అక్రమ కేసులు, దెబ్బలు తింటూ భరిస్తూ వచ్చామన్నారు. ఇపుడు చంద్రబాబు ప్రభుత్వంలో కూడా తప్పులు చేయకపోయినా తామే కేసులు,దెబ్బలు తింటున్నామని, కుటుంబ పెద్దను కూడా కోల్పోయామని వాపోయారు. బాధితులుగా పోలీస్ స్టేషన్‌కు వెళితే పుంగనూరు సీఐ శ్రీనివాసులు తమనే తిట్టేవారని రామకృష్ణ భార్య దేవమ్మ, కుమారులు శివ, సురేశ్ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ప్రభుత్వంలోనూ న్యాయం జరగకపోతే ఏమి చేయాలని ప్రశ్నించారు. చల్లా వెంటనే సీఎంకు ఫోన్ చేసి.. కుటుంబీకులతో మాట్లాడించారు. 'రామకృష్ణ హత్య దురదృష్టకరం. టీడీపీ అండగా ఉంటుంది.ఆందోళన చెందొద్దు. త్వరలోనే మంత్రులు, పార్టీ పెద్దలు మిమ్మల్ని కలుస్తారు. అంత్యక్రియలు చేయండి' అని చంద్రబాబు భరోసా ఇచ్చారు. అలాగే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలతోనూ రామకృష్ణ కుమారులు శివ, సురేశ్‌లతో ఫోన్లో మాట్లాడి ధైర్యం చెప్పారు.

మరోవైపు చల్లా బాబు,షాజహాన్‌బాషాలు చిత్తూరు ఎస్పీ మణికంఠ, పలమనేరు డీఎస్పీ ప్రభాకర్‌లతో హంతకుల అరెస్టుపై మాట్లాడారు. పుంగనూరు, చౌడేపల్లె, మదనపల్లె తదితర ప్రాంతాలనుంచి అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు,కార్యకర్తలు తరలివచ్చి అశ్రునయనాల మధ్య రామకృష్ణ అంత్యక్రియలు మధ్యాహ్నం మూడు గంటలకు పూర్తిచేశారు. ఇక రామకృష్ణ హత్య తెలిసిన వెంటనే శనివారం పలువురు ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు మదనపల్లె ఆస్పత్రికి వచ్చి బాధితులను పరామర్శించారు. అయితే ఆదివారం పార్టీ అధినాయకులు, మంత్రులు రాకపోవడంపై టీడీపీ శ్రేణుల్లో నిరుత్సాహం కనిపించింది. టీడీపీ నేతలు మాధవరెడ్డి, గంగాధర్, రాఘవ,రవికుమార్, సుబ్రహ్మణ్యంరాజు, ప్రసాద్ స్వామి, పగడాల రమణ, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోలీస్ పికెట్

రామకృష్ణ హత్య సందర్భంగా కృష్ణాపురంలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది. డీఎస్పీ ప్రభాకర్, సీఐ రాంభూపాల్‌రెడ్డి గ్రామంలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా బందోబస్తును పరిశీలించారు.

పోలీసుల నిర్లక్ష్యంతోనే రామకృష్ణ హత్య

- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే పుంగనూరులో రామకృష్ణ హత్యకు గురయ్యారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ ఆరోపించారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇది ముమ్మాటికీ రాజకీయ హత్యనేనని చెప్పారు. నిందితుడు వెంకట్రమణ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుడన్నారు. వెంకట్రమణ తదితరులు గతంలో దాడిచేశారని, రక్షణ కల్పించాలని రామకృష్ణ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం మారినా కొంతమంది పోలీసు అధికారులు వైసీపీకి అనుకూలంగా వ్యవహరించడం సరికాదని చెప్పారు.

పుంగనూరులో పెద్దిరెడ్డి ఆటలు సాగనివ్వం

అమరావతికి రావాలంటూ చల్లాకు చంద్రబాబు సూచన

పుంగనూరులో ఇకపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఆటలు సాగవని, టీడీపీ శ్రేణులను ఇబ్బందిపెడితే కఠిన చర్యలు తప్పవని సీఎం చంద్రబాబు చెప్పారు. రామకృష్ణ కుటుంబంతో మాట్లాడాక చల్లాతో 10 నిమిషాలు ఫోన్లో మాట్లాడారు. అసెంబ్లీ తర్వాత 15 రోజుల్లో అమరావతికి రావాలని సూచించారు. పుంగనూరు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి అరాచకాలు అడ్డుకుంటూ.. పార్టీ శ్రేణుల సమస్యలపై చర్చించాలని, ఇలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తవహించాలని చెప్పారు. మూడ్రోజుల్లో మంత్రులు పుంగనూరుకు వస్తారని, రామకృష్ణను చంపిన వారికి చట్ట ప్రకారం శిక్షపడేలా పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడతానన్నారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ.. గతంలో దాదాపు 700 మంది టీడీపీ కార్యకర్తలు, నాయకులపై వైసీపీ నేతలు అక్రమంగా 307 కేసులను పెట్టి ఇబ్బంది పెట్టారన్నారు. ఈ కేసులను ఎత్తివేయాలని, కార్యకర్తలు మన ప్రభుత్వానికి, గత ప్రభుత్వానికి వ్యత్యాసం చూస్తున్నారని సీఎంతో అన్నారు.



సీఎం చంద్రబాబుతో ఫోన్లో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

రామకృష్ణ మృతి టీడీపీకి తీరని లోటు

టీడీపీ కార్యకర్త రామకృష్ణ మృతి టీడీపీకి తీరని లోటని చల్లా రామచంద్రారెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. వారు కృష్ణాపురంలో మాట్లాడుతూ.. రామకృష్ణ ఎన్నికల సమయంలో పార్టీ కోసం ఎనలేని కృషి చేశారని కొనియాడారు. రామకృష్ణ కుటుంబంపై ఇప్పటికే మూడు సార్లు దాడులు చేసినా పోలీసులు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. హంతకుడు వెంకట్రమణతో పాటు అతడికి సహకరించిన వారు ఎంతటివారైనా వదలిపెట్టేది లేదని హెచ్చరించారు. సీఐ శ్రీనివాసులు సకాలంలో స్పందించి ఉంటే రామకృష్ణ ప్రాణాలు పోయేవి కావన్నారు. సీఐని ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పది కిలోమీటర్ల దూరంలో మదనపల్లె ఉందని మీకు ఏ ఇబ్బంది ఉన్నా తనవద్దకు రావాలని టీడీపీ శ్రేణులతో షాజహాన్ అన్నారు.

త్వరలోనే హంతకులను పట్టుకుంటాం: డీఎస్పీ

రామకృష్ణ హత్యకు కారకులైన హంతకులను పట్టుకోవడానికి నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. సీసీ ఫుటేజీ, సెల్ ఫోన్ ట్రాకింగ్, సాంకేతిక ఆధారాలు అన్నింటిపై దృష్టి పెట్టామని చెప్పారు. సీఐను సస్పెండ్ చేశామని, ఈకేసుపై విచారణ జరుగుతోందన్నారు. ఆయన వెంట పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్, పుంగనూరు, చౌడేపల్లె, సోమల, గంగవరం, పలమనేరు ప్రాంతాల నుంచి భారీగా పోలీసులు కృష్ణాపురానికి చేరుకున్నారు. చిత్తూరు ఎస్పీ మణికంఠ పుంగనూరు చేరుకుని కృష్ణాపురంలో జరిగే ప్రతి విషయాన్ని పలమనేరు డీఎస్పీ ద్వారా తెలుసుకున్నారు.

- పుంగనూరు, ఆంధ్రజ్యోతి

నేటినుంచి టెన్త్ పరీక్షలు

- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ అధికారులు
- 21,248 మంది విద్యార్థులకు 118 పరీక్ష కేంద్రాల ఏర్పాటు



చిత్తూరు రాంనగర్ కాలనీలోని కింగ్స్ స్కూల్లో ఏర్పాటు చేసిన బెంచీలు

చిత్తూరు సెంట్రల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు విద్యాశాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. వీటితోపాటు ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షలు కూడా నిర్వహించనున్నారు. దూర ప్రాంత విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పించారు. పరీక్ష కేంద్రాల వద్ద 163వ సెక్షన్ అమలులో ఉంటుందని ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి తెలిపారు. కేంద్రాల వద్ద జెరాక్స్ కేంద్రాలు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ వరకు రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. జిల్లాలో 21,248 మంది పరీక్షకు హాజరుకానున్నారు. వీరిలో బాలురు 11,005 మంది, బాలికలు 10,243 మంది ఉన్నారు. వీరికోసం 118 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 11 సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణలో 118 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 118 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 1197 మంది ఇన్విజిలేటర్లు, 37 మంది స్టోరేజ్ కస్టోడియన్లు పాల్గొంటారు. అలాగే 40 సిట్టింగ్ స్క్వాడ్లు, 8 ఫ్లైయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. విద్యార్థుల కోసం హెల్ప్‌లైన్ నెంబరు (90321 85001) అందుబాటులో ఉంచారు. ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షలను 1165 మంది రాయనున్నారు. వీరికోసం 20 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

చితూరు అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలనుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామన్నారు. అలాగే ఆయా మండల, నియోజకవర్గాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ..

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం పీజీఆర్ఎస్ జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాధితుల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామన్నారు.

రేపు రాజకీయ పార్టీల సమావేశం

చిత్తూరు సెంట్రల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి అన్ని రాజకీయ పార్టీలతో మంగళవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేసినట్లు డీఆర్వో మోహన్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీల అధ్యక్షులు, ప్రతినిధులు, సీనియర్ నాయకులు, సమావేశానికి హాజరు కావాలని కోరారు.

పట్టుపడితే పూర్వవైభవం

- పలమనేరులో దశాబ్దకాలంగా మూతపడ్డ పట్టుగుడ్ల ఉత్పత్తి కేంద్రం
- నిరుపయోగంగా మారిన కోట్లాది రూపాయల భవనాలు, పరికరాలు

వృథాగా మారిన భవనాలు






వర్మికల్చర్ షెడ్

వర్మికల్చర్ షెడ్డుదీ అదేదారి

నాణ్యమైన మల్బరీ ఆకు ఉత్పత్తి కోసం వర్మి కల్చర్ షెడ్డును నిర్మించారు. ఇక్కడ ఎరువును తయారు చేసి.. మల్బరీ తోటలకు వినియోగించేవారు. ప్రస్తుతం ఈ షెడ్డు కూడా నిరుపయోగమైంది.



వృథాగా ట్రాన్స్‌ఫార్మర్

మెరుగైన విద్యుత్ సరఫరా కోసం అప్పట్లో సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఇది కూడా ప్రస్తుతం వృథాగా పడి ఉంది.

చీకటి, అసాంఘిక కార్యకలాపాలు

పట్టణ పొలిమేరల్లో ఉండటంతో నేడీ కేంద్రం చీకటి, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. మందుబాబులు, పేకాటరాయుళ్లకు అడ్డాగానూ తయారైంది.




నీటి తొట్టె



విశాలమైన బావి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో దాదాపు 38 వేల ఎకరాల్లో మల్బరీ సాగవుతోంది. అయినా పలమనేరులోని పట్టుగుడ్ల ఉత్పత్తి కేంద్రం దశాబ్ద కాలంగా మూతపడింది. ఒకప్పుడు ఈ కేంద్రం కీలకపాత్ర పోషించింది. ఇప్పుడు పట్టించుకునే నాథుడి కోసం ఎదురుచూస్తోంది. ప్రభుత్వం కాస్త శ్రద్ధ పెడితే పూర్వవైభవం సంతరించుకుంటుంది.

- పలమనేరు, ఆంధ్రజ్యోతి



పలమనేరు పట్టుగుడ్ల ఉత్పత్తి కేంద్రం మ్యాపు

పలమనేరులో నాలుగు దశాబ్దాల క్రితం పట్టణానికి ఆనుకుని 7.5 ఎకరాల స్థలంలో పట్టుగుడ్ల ఉత్పత్తి కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దాదాపు రెండు దశాబ్దాలపాటు ఇక్కడ పట్టుగుడ్లు ఉత్పత్తి చేశారు. సుమారు 50 కోట్లకుపైగా విలువైన స్థలంలో ఈ కేంద్రం ఏర్పాటైంది. పట్టుగుడ్ల ఉత్పత్తికి అవసరమైన పలు భవనాలను కోట్లాది రూపాయలు వెచ్చించి ఇక్కడ నిర్మించారు. అంతేగాక పట్టుపురుగులకు కావాల్సిన మల్బరీ తోటలను కూడా సాగు చేస్తుండేవారు. ఇందుకోసం ఒక పెద్ద వ్యవసాయ బావిని, పంపుషెడ్డును కూడా పట్టు పరిశ్రమశాఖ అప్పట్లో నిర్మించింది. నీటిని లిఫ్టింగ్ చేసి, నిల్వ ఉంచడానికి ఒక విశాలమైన తొట్టెను కూడా బావిపక్కనే ఏర్పాటు చేశారు. ఈ బావిలో వేసవి కాలంలో తగిన మేర నీరు రావడం లేదని నాలుగు బోర్లు వేశారు. రెండు బోర్లలో నీరు సరిగా రాలేదని.. మోటర్లు తొలగించారు. నేడు వ్యవసాయ బావికున్న మోటరు, రెండు బోర్లకున్న మోటర్లు తుప్పు పడుతున్నాయి. అప్పట్లో నాటిన యుకలిప్టస్ మొక్కలు నేడు దాదాపు 100 అడుగుల ఎత్తు పెరిగాయి. మల్బరీ తోటలకు నీరు అందించడానికి లక్షలాది రూపాయలు వెచ్చించి వేసిన పైపులైన్లు కూడా వృథా అయ్యాయి.

ప్రత్యేకాధికారి మదనపల్లెలో..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పట్టుగుడ్ల తయారీ కోసం ఒక ప్రత్యేక అధికారిని పట్టుపరిశ్రమ శాఖ నియమించింది. ఆ అధికారి మదనపల్లెలో ఉంటూ పట్టుగుడ్ల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలిస్తుంటారని సెరికల్చర్ శాఖ సిబ్బంది చెబుతున్నారు. జిల్లా విభజనతో మదనపల్లె.. అన్నమయ్య జిల్లాకు వెళ్లినా.. పర్యవేక్షణ మాత్రం అక్కడి అధికారి పరిధిలోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఇకనైనా జిల్లాలోని పట్టుపరిశ్రమ అధికారులు, ప్రభుత్వం స్పందించి ఈ పట్టుగుడ్ల తయారీ కేంద్రానికి పూర్వవైభవం తేవాలని స్థానికులు కోరుతున్నారు.

మండుతున్న సూరీడు

- తవణంపల్లెలో 39.7 డిగ్రీల ఉష్ణోగ్రత

చిత్తూరు సెంట్రల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. తవణంపల్లె మండలంలో ఆదివారం అత్యధికంగా 39.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అత్యధిక మండలాల్లో 40 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరువవుతుండటంతో జనం అల్లాడిపోతున్నారు. మండలాల వారీగా.. గంగవరంలో 39.2, నింద్ర, ఎస్‌ఆర్‌పురంలో 38.8, గుడిపాల, చిత్తూరులో 37.5, పులిచెర్లలో 37.4, నగరిలో 37.3, పెద్దపంజాణిలో 37, సదుం, పులిచెర్లలో 36.7, గుడుపల్లెలో 36.6, పాలసముద్రం, వెదురుకుప్పం, విజయపురం, ఐరాల, చౌడేపల్లెలో 36.5, జీడీ నెల్లూరులో 36.3, బంగారుపాళ్యం, శాంతిపురంలో 36.2, పెనుమూరు, పలమనేరులో 36.1, సోమలలో 36, పూతలపట్టులో 35.9, యాదమరి, వి.కోటలో 35.8, కార్వేటినగరంలో 34.7, బైరెడ్డిపల్లెలో 34.6, రామకుప్పంలో 34.2, పుంగనూరులో 33.6, కుప్పంలో 33.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:29 (సోమవారం సాయంత్రం)
సహర్: 4:59 (మంగళవారం ఉదయం)

పంటలపై ఆగని గజదాడులు



పత్రపల్లెలో ధ్వంసమైన బోరుబావి పైపులు - రాచూరు వద్ద విరిచేసిన ఫెన్సింగ్, టెంకాయ చెట్లు

యాదమరి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. యాదమరి సరిహద్దుల్లోనే ఏనుగులు సంచరిస్తున్నాయి. నుంజర్ల చెరువులో 19 ఏనుగుల గుంపు పగలు తిష్టవేసి, రాత్రి వేళల్లో యాదమరి మండలంలోని పొలాలపై పడుతోంది. శనివారం రాత్రి పత్రపల్లె గ్రామ సమీపంలోని రైతు పట్టాభి పొలంలోని వ్యవసాయ బోరుతోపాటు పైపులు, మామిడి, పనస, మిరప, టెంకాయ చెట్లను ఏనుగులు ధ్వంసం చేశాయి. కొలనాంపల్లెలోని రైతు భూపాలన్‌కి చెందిన మామిడి, అరటి పంటలను, పెరగాండ్లపల్లెలోని రైతులు వరదరాజులు, చిన్నబ్బ, దేవరాజులు, నాగరాజు, రామమూర్తిలకు చెందిన వరి, రాగి, మిరప పంటలను, రాచూరు రైతులు సర్వేశ్ నాయుడు, చంద్రశేఖర్‌లకు చెందిన ఫెన్సింగ్, టెంకాయ చెట్లు నాశనం చేశాయి. అటవీ సిబ్బంది ట్రాకర్ల.. ద్వారా బాణసంచా పేల్చి ఏనుగులను అడవిలోకి మళ్లించే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

పులిచెర్ల మండలంలో ఒంటరి ఏనుగు స్వైరవిహారం



విరిచేసిన విద్యుత్ స్తంభం

కల్లూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాతపేట, కల్లూరు, పాళెం పంచాయతీల్లో శనివారం రాత్రి పంటలపై ఒంటరి ఏనుగు స్వైరవిహారం చేసింది. మామిడి, కొబ్బరి చెట్లు ధ్వంసం చేయగా, ఓ విద్యుత్తు స్తంభాన్ని విరిచేసింది. కల్లూరు నుంచి గంటావారిపల్లెకు వెళ్లే రోడ్డు సమీపంలోని పశ్చిమ విభాగం అటవీ ప్రాంతం నుంచి ఈ ఒంటరి ఏనుగు.. పాతపేట పంచాయతీ ఎద్దులవారిపల్లె వద్దకు చేరుకుంది. ఎద్దులవారిపల్లెలోని రైతు కృష్ణమూర్తి, కల్లూరులోని రైతు శ్రీరాములుకు చెందిన మామిడి చెట్లను ధ్వంసం చేసింది. రైతు రామచంద్రయ్యకు చెందిన కొబ్బరి, మామిడిచెట్లను విరిచేసింది. కోటపల్లెలోని రైతు దామోదర్‌నాయుడుకు చెందిన 8 మామిడిచెట్లను ధ్వంసం చేసి.. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోకి చేరుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి



తులసమ్మ (ఫైల్ ఫొటో)

రామకుప్పం, మార్చి 16 ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం నెర్నిల్లికి చెందిన శతాధిక వృద్ధురాలు తులసమ్మ (104) ఆదివారం మృతి చెందారు. తుది శ్వాస విడిచే వరకు ఆమె తన పనులు తనే చేసుకునేదని కుటుంబసభ్యులు తెలిపారు. తులసమ్మ ఆహారపు అలవాట్లు క్రమశిక్షణగా ఉండేవని.. రాగి, సామలు వంటి చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలను తీసుకుకునేదని పేర్కొన్నారు.

బోయకొండ గంగమ్మకు పంచామృతాభిషేకాలు



అమ్మవారి దర్శనం కోసం వేచిఉన్న భక్తులు - (ఇన్‌సెట్‌లో) గంగమ్మ

చౌడేపల్లె, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ భక్తులతో కిక్కిరిసింది. ఉదయాన్నే ఆలయ వేదపండితులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అమ్మవారికి పంచామృతాభిషేకాల అనంతరం స్వర్ణాభరణాలు.. వివిధ రకాల పూలతో అలంకరించారు. తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఉపాధ్యాయుడి మృతి



మృతిచెందిన వెంకటరమణ

చౌడేపల్లె, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపుతప్పిన ప్రమాదంలో ఓ ఉపాధ్యాయుడు మృతిచెందిన సంఘటన చౌడేపల్లె మండలంలో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ నాగేశ్వరరావు కథనం మేరకు.. మదనపల్లెకు చెందిన నారాయణప్ప కుమారుడు ఉపాధ్యాయుడు వెంకటరమణ (55) చౌడేపల్లెలోని వారి బంధువుల గృహప్రవేశానికి తన ద్విచక్రవాహనంలో వస్తుండగా మండలంలోని దిగువపల్లె పంచాయతీ పక్షిరాజపురం వద్ద అదుపుతప్పి పడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటరమణను 108 వాహనంలో మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరసిద్ధుడి సేవలో పంచాయతీరాజ్ ఉన్నతాధికారి




ఆలయంలో కృష్ణతేజతో అధికారులు

ఐరాల(కాణిపాకం), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ కృష్ణతేజ ఆదివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతి సాగర్‌రెడ్డి, మాజీ చైర్మన్ మణినాయుడు, ఏఈవో రవీంద్రబాబు, చిత్తూరు పంచాయతీరాజ్ అధికారి సుధాకర్‌రావు, తహసీల్దార్ మహేష్‌కుమార్, ఎంపీడీవో ధనలక్ష్మి, ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, ఈవోపీఆర్డీ కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు కాణిపాకంలో సంకటహర గణపతి వ్రతం

ఐరాల(కాణిపాకం), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో సోమవారం సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పెంచలకిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. పౌర్ణమి తర్వాత నాల్గవ రోజున రెండు దఫాలుగా ఈ వ్రతాన్ని నిర్వహిస్తారు. కౌంటర్‌లో టికెట్టు కొనుగోలు చేసి వ్రతంలో పాల్గొనవచ్చన్నారు. సాయంత్రం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామిని స్వర్ణ రథంపై మాడవీధుల్లో ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు.

వాహనాల బారులు



అలిపిరిలోని భద్రతా తనిఖీల కేంద్రం ఆదివారం వాహనాలతో కిక్కిరిసిపోయింది. తనిఖీ కేంద్రం నుంచి గరుత్మంతుడి విగ్రహం ముందున్న ఆర్చ్ వరకు వాహనాలు బారులుతీరాయి. శ్రీవారి దర్శనార్థం అధిక సంఖ్యలో భక్తులు తిరుమల చేరుకుంటున్నారు. దీంతో వాహనాలను తనిఖీ చేసే అలిపిరి వద్ద వాహనాల సంఖ్య పెరిగిపోయిన క్రమంలో భద్రతా సిబ్బంది వేగవంతంగా తనిఖీ చేసి తిరుమలకు పంపారు. సాయంత్రం తర్వాత చెక్‌పాయింట్ వద్ద సాధారణస్థితి నెలకొంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కిక్కిరిసిన భక్తులు



వారాంతపు సెలవుల నేపథ్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. సుమారు 27వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 397మంది, రూ.200 శీఘ్ర దర్శనంలో 3,219.. రూ.50ప్రత్యేక దర్శనంలో 3,650 మంది దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,090మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,234, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 321మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 234మంది, రూ.5వేల టిక్కెట్ల ద్వారా 98మంది పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 21,718 అమ్ముడుపోయాయి.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

పోలీసు అధికారులు కావలెను!

- తిరుపతి డీఎస్పీ, ఈస్ట్, వెస్ట్ సీఐలుగా ఇన్‌చార్జులు
- స్పెషల్ బ్రాంచికి డీఎస్పీ లేరు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు వ్యవస్థను సిబ్బంది కొరత వేధిస్తోంది. జిల్లా కేంద్రమైన తిరుపతి నగర డీఎస్పీ పోస్టు కొన్ని నెలలుగా ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేస్తుండిన వెంకటనారాయణను బదిలీ చేసిన ప్రభుత్వం రెగ్యులర్ డీఎస్పీని నియమించలేదు. తాత్కాలికంగా మహిళా స్టేషన్ డీఎస్పీ శ్రీలతను ఇన్‌చార్జిగా నియమించారు. వీఐపీల తాకిడి, రాత్రి గస్తీలు, శాంతి భద్రతల పరిరక్షణ వంటివి కష్టతరమవుతున్నాయి. డివిజన్ పరిధిలోని నాలుగు సర్కిళ్లలో ఈస్ట్, వెస్ట్‌లకు రెగ్యులర్ సీఐలు లేరు. వెస్ట్ సీఐగా పనిచేస్తుండిన రామకృష్ణను గతంలో ఎస్పీ సుబ్బరాయుడు ఇన్‌చార్జి సీఐగా అటాచ్‌మెంటు కింద నియమించారు. మొన్నటివరకు వీఆర్‌లో ఉన్న మురళీమోహన్‌రావును తాత్కాలికంగా వెస్ట్ సీఐగా అటాచ్‌మెంట్ ఇచ్చారు. మరోవైపు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోస్టు ఖాళీగా ఉంది. గతంలో ఇక్కడ పనిచేసిన గిరిధర్ వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లారు. ఆయన మళ్లీ జాయిన్ అవుతారనే విషయం అనుమానంగానే ఉందన్న చర్చ నడుస్తోంది. జిల్లా మొత్తం స్పెషల్ బ్రాంచ్ వ్యవహారాలు సీఐ ఒక్కరే చూస్తున్నారు. అతను కూడా కొత్తగా బాధ్యతలు స్వీకరించడంతో జిల్లాపై పూర్తి స్థాయి అవగాహన లేదు. తిరుపతి ప్రాముఖ్యత దృష్ట్యా పోలీసు శాఖలో ఖాళీలను భర్తీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వైసీపీ ముసుగు తీయండి

- వారితో అంటకాగితే స్థాన చలనం తప్పదు
- పోలీసులకు శాప్ చైర్మన్ హెచ్చరిక



సన్మానం అందుకుంటున్న కూటమి నేతలు

తిరుపతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): 'కొన్ని పోలీస్ స్టేషన్లు ఇప్పటికీ వైసీపీ ముసుగు కప్పుకుని ఉన్నాయి. కొందరు అధికారులు వైసీపీ నేతలతో అంటకాగుతున్నారు. ఇప్పటికే అధినాయకుడి దృష్టికి వారి జాబితా వెళ్లింది. అలాంటివారిని ఉపేక్షించేదిలేదు' అని శాప్ చైర్మన్ రవి నాయుడు హెచ్చరించారు. తిరుపతిలో ఆదివారం జరిగిన కూటమి నాయకుల సన్మాన కార్యక్రమంలో రవినాయుడు మాట్లాడారు. పార్టీ అధికారంలో ఉండి కూడా కార్యకర్తలను పోగొట్టుకుంటున్నామంటే పోలీసుల అలసత్వమే కారణమన్నారు. 'ప్రాణహాని ఉదంటూ పుంగనూరులో టీడీపీ కార్యకర్త రామకృష్ణ వీడియో పెట్టిన తర్వాత కూడా పోలీసులు చోద్యం చూశారు. అనంతరం ఆయన హత్యకు గురయ్యారు. ఇటీవల వైసీపీ నిర్వహించిన యువత పోరులో కొందరు కలెక్టరేట్ గేట్లు విరిచి, ఎన్‌హెచ్‌పై ట్రాఫిక్ ఇబ్బందులు కలిగిస్తే వారిని వదిలిపెట్టేశారు. డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా వైసీపీ నేత అభినయ్ రెడ్డి అలిపిరి పోలీస్ స్టేషన్‌లో హల్‌చల్ చేస్తే కేసు నమోదు చేసి చేతులు దులుపుకొన్నారు. మా నాయకులపైన కేసులు పెట్టడం, సమస్యపైన వెళితే తాత్సారం చేయడంలో మాత్రం అత్యుత్సాహం చూపుతున్నారు. కార్యకర్తల మనోభావాలు కాపాడే విషయంలో మూడు పార్టీలు ఒకే నిర్ణయంతో ఉన్నాయి' అని రవినాయుడు అన్నారు.

కార్యకర్తల కష్టంతోనే మనకీ పదవులు

- 'కూటమి' నాయకులకు ఘన సన్మానం

'గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంతో తలపడిన కూటమి కార్యకర్తల కష్టంతోనే మనకు ఈ పదవులు దక్కాయి. దశల వారీగా అందరికీ న్యాయం చేసేందుకు పార్టీ ముఖ్యులు సిద్ధంగా ఉన్నారు' అని నాయకులు అన్నారు. నామినేటెడ్, పార్టీ పదవులు పొందిన కూటమి నేతలు.. శాప్ చైర్మన్ రవి నాయుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు కుమారమ్మ, కరాటే చంద్ర, బాలసుబ్రమణ్యంను ఆదివారం సత్కరించారు. ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వూకా విజయకుమార్ ఆధ్వర్యంలో తిరుపతిలోని నిర్మల రామయ్య కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరిగింది. సన్మాన గ్రహీతలతో పాటు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ, జనసేన జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ పులుగోరు మురళీకృష్ణారెడ్డి ప్రసంగించారు. కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్రనాథ్, నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ : తొమ్మిది మందికి గాయాలు



కాశిపెంట్ల సమీపంలో ఢీకొన్న రెండు కార్లు



అంబులెన్స్‌లో క్షతగాత్రులు

చంద్రగిరి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశిపెంట్ల వద్ద పూతలపట్టు, నాయుడుపేట జాతీయ రహదారిలో ఆదివారం సాయంత్రం ముందు వెళుతున్న కారును వెనుక వస్తున్న మరో కారు ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర, ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. కడప నుంచి శ్రీనివాసన్, మంజునాథ, గీతా, భాగ్యలక్ష్మి, సువార్త, అరవింద్‌కుమార్ కారులో కుప్పంకు వెళుతున్నారు. కాశిపెంట్ల సమీపంలో తిరుపతికి చెందిన భువనాదిత్య, వరప్రసాద్, సాయికుమార్ వ్యక్తిగత పనులపై కారులో చిత్తూరు వైపు వెళుతున్నారు. అదుపుతప్పి ముందు వెళుతున్న కారును ఢీకొట్టారు. దీంతో ముందు వెళుతున్న కారు టైరు పంక్చరై పక్కనున్న కల్వర్టును ఢీకొంది. అందులోని శ్రీనివాసన్, మంజునాథలకు తీవ్ర గాయాలు కాగా, గీతా, భాగ్యలక్ష్మి, సువార్త, అరవింద్‌కుమార్ స్వల్పంగా గాయపడ్డారు. మరో కారులోని భువనాదిత్య, సాయికుమార్, వరప్రసాద్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ అధికారులు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను చంద్రగిరిలోని సీహెచ్‌సీ, తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి సేవలో జస్టిస్ వెంకటరమణ



జస్టిస్ దుప్పల వెంకటరమణ



జస్టిస్ భవాని సుబ్బరాయన్

తిరుమల, మార్చి16(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అలాగే మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భవానీ సుబ్బరాయన్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. వారికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

నృత్యం ముగ్ధ మనోహరం



తిరుచానూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సెలవులో భాగంగా చెన్నైకు చెందిన కల్పవార్షిక ఆర్ట్ అకాడమీ కళాకారులు ఆదివారం ప్రదర్శించిన నృత్యం ముగ్ధమనోహరంగా సాగింది. కళాకారులు జనని, మేనక, శశేనక, శివసీయశ్రీ, వేదప్రియ, సుదర్శన వాస్తవ్, సహాన, శ్రీనిధి, కావ్య తదితరులు మల్లారి, గజవదన, బృందావన నిలయే, అంతయు నీవే, దుర్గాలక్ష్మి సరస్వతి, మురళీధర గోపాల, వరణ అయిరాం, శ్రీనివాస కల్యాణం, మదుమ్మైకుం కన్నె, ముత్తయితు మురగా వంటి కీర్తనలకు భరతనాట్య ప్రదర్శన చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

విద్యుత్ ఉద్యోగులకు ఒకే సర్వీస్ రూల్స్ అమలు చేయండి



సభలో ప్రసంగిస్తున్న సుగుణాకరరావు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న అన్ని కేడర్ల ఉద్యోగులకు ఒకే సర్వీస్ రూల్స్ అమలు చేయాలని తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి పి.సుగుణాకరరావు కోరారు. తిరుచానూరులోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఆదివారం సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ త్రైపాక్షిక ఒప్పందంలో భాగంగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల మధ్య తారతమ్యం లేకుండా సర్వీస్ రూల్స్ అమలు చేయాలని కోరారు. రెగ్యులేషన్లు, ప్రమోషన్లు, కరువుభత్యం చెల్లింపులు, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు, ఇతర సంక్షేమ పథకాలు యథావిధిగా అమలు చేయాలన్నారు. పనిభారాన్ని దృష్టిలో ఉంచుకుని నూతన పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కారుణ్య నియామకాల్లో ప్రస్తుతమున్న నిబంధనలను అమలు చేయాలన్నారు. బకాయి ఉన్న మూడు డీఏలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదనరెడ్డి, కె.వెంకటేశ్వరరావు, రమేష్, మూర్తి పాల్గొన్నారు.

వీఆర్‌కు గాజులమండ్యం సీఐ, ఎస్‌ఐ?

రేణిగుంట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం గాజులమండ్యం సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ సుధాకర్‌ను వీఆర్‌కు పంపినట్లు తెలిసింది. స్క్రాప్ లారీ తనిఖీ సందర్భంగా లంచం డిమాండు చేశారన్న అంశంపై చర్యలు తీసుకున్నట్లు సమాచారం. వివరాలిలా ఉన్నాయి. నాలుగు రోజుల కిందట కేఎల్‌ఎం హాస్పిటల్ కూడలిలో గాజులమండ్యం సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ సుధాకర్ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో తిరుపతి విమానాశ్రయ సమీపంలోని ఓ పరిశ్రమకు చెందిన స్క్రాప్ లారీ వెళుతుండగా ఆపి.. తనిఖీలు చేశారు. అదే సమయంలో డబ్బులు డిమాండ్ చేయడంతో.. ఈ విషయాన్ని కంపెనీ యాజమాన్యానికి డ్రైవర్ తెలిపారు. ఆ పరిశ్రమకు చెందిన యజమాని.. కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేశారు. అక్కడ్నుంచి డీజీపీకి ఫోన్ కాల్ వచ్చింది. డీజీపీ ఆదేశాల మేరకు సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ సుధాకర్‌ను వీఆర్‌కు అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి బాజ్‌పాయ్ పంపినట్లు సమాచారం. వీరి స్థానాల్లో ఏర్పేడు సీఐ జయచంద్ర, రేణిగుంట అర్బన్ ఎస్‌ఐ అరుణ్ కుమార్ ఇన్‌చార్జులుగా ఆదివారం బాధ్యతలు స్వీకరించినట్లు తెలిసింది. దీనిపై ఎస్పీ హర్షవర్ధన్‌రాజును వివరణ కోరగా.. ఘటన జరిగింది వాస్తవమేనని తెలిపారు. దీనిపై వివరణ ఇవ్వాలని డీఐజీ ఆదేశించడంతో వారు అనంతపురానికి వెళ్లారన్నారు.

నేడు సాధువుల పాదయాత్ర



మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాసానందస్వామి

తిరుపతి అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): తిరుమల పవిత్రతను కాపాడుకుందామనే నినాదంతో పలు రాష్ట్రాలకు చెందిన సాధువులు సోమవారం ఉదయం అలిపిరి మెట్లమార్గంలో పాదయాత్ర చేయనున్నారు. ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన పలువురు మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామీజీలు ఆదివారం సాయంత్రం లీలామహల్ కూడలి చేరుకున్నారు. అభయహస్త సేవా మండలి ఉపాధ్యక్షుడు జగన్నాథం స్వాగతం పలికి, విశ్రాంతి ఏర్పాట్లు చేశారు. ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానందస్వామి మాట్లాడుతూ జూపార్కు రోడ్డులో శేషాచలం అటవీ ప్రాంతానికి సమీపంలో ఒబరాయ్ హోటల్ నిర్మాణాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్ 1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం	: రూ.4కోట్లు
శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు	: 82,580
తలనీలాలు సమర్పించినవారు	: 31,905

18 నుంచి అన్నమాచార్య ఉత్సవాలు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు అన్నమాచార్య ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తిరుపతి శ్రీత్యాగరాజస్వామి కల్చరల్ ట్రస్ట్ నిర్వాహకులు మోహన్ సుందరం, కంచి రఘురామ్ వెల్లడించారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ 80 సంవత్సరాలుగా త్యాగరాజ స్వామి ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది అన్నమాచార్య సంకీర్తన ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రముఖ సంగీత విద్వాంసులు ఎమ్మెస్ సుబ్బులక్ష్మి మనవరాళ్లు షణ్ముఖ ప్రియ, హరిప్రియ హాజరవుతారని తెలిపారు.

అశ్వవాహనంపై లక్ష్మీనరసింహుడి దివ్యతేజం

● ఘనంగా పార్వేట వేడుకలు



పార్వేట వేడుకను ప్రారంభిస్తున్న అర్చకులు

కల్లూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు ఆదివారం అశ్వవాహనంపై స్వామి అమ్మవార్లు నాలుగు మాడ వీధుల్లో విహరించారు. ఆలయంలో ఉదయం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకృతుడైన స్వామివారు పురవీధుల్లో ఊరేగారు. వాహనం ముందు కోలాటాలు, భజనలు నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీ నరసింహస్వామి ప్రత్యేక వాహనంపై ఆసీనులై మంగళవాయిద్యాలు నడుమ పార్వేట మండపానికి చేరుకున్నారు. అక్కడ స్వామివారికి ఆరాధన, హారతులిచ్చారు. సాంప్రదాయబద్ధంగా ఆలయ ప్రధాన అర్చకులు అనంతకుమారాచార్యులు పార్వేట వేడుకను ప్రారంభించారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అశ్వవాహనం, పార్వేట ఉభయదారులుగా కమ్మసంఘం వ్యవహరించారు. అన్నదానం చేపట్టారు. వేడుకల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఏపీఆర్ఎస్ఏ కుప్పం డివిజన్ నూతన సంఘం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన ఏపీఆర్ఎస్ఏ నాయకులను సత్కరిస్తున్న ఉద్యోగులు

కుప్పం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఏపీఆర్ఎస్ఏ (ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్) కుప్పం డివిజన్ నూతన సంఘం ఎన్నికలు ఆదివారం కుప్పంలోని ఎన్జీవో హోమ్‌లో జరిగాయి. ఏపీఆర్ఎస్ఏ కుప్పం డివిజన్ అధ్యక్షుడిగా రామకుప్పం డిప్యూటీ తహసీల్దారు ఆర్ఎస్.బాలాజీ, అసోసియేటెడ్ అధ్యక్షులుగా గుడుపల్లె తహసీల్దారు టి.సీతారామ్, ఉపాధ్యక్షులుగా రామకుప్పం తహసీల్దారు కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వి.నారాయణ, కడా ఎంఆర్ఐ జేజే.జోషి, ప్రధాన కార్యదర్శిగా కుప్పం తహసీల్దారు కార్యాలయం వేణుగోపాల్, సంయుక్త కార్యదర్శులుగా కడా కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ దామోదరాచారి, కుప్పం ఆర్డీవో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ చరిత్ నాయుడులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన వారినికి ఇతర రెవెన్యూ ఉద్యోగులు సత్కరించారు.

సర్వేలతో ఒత్తిడికి గురవుతున్నామని వేదన



వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పలమనేరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నిత్యం ఏదో ఒక సర్వే చేయాలని ప్రభుత్వం నుంచి వస్తున్న ఆదేశాల మేరకు జిల్లా, మండలస్థాయి అధికారులు తమపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారని.. అనేక మంది అనారోగ్యం పాలవుతున్నామని ఆదివారం పలమనేరు ఎన్జీవో సంఘ అధ్యక్షులు ఆనందబాబుకు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వాన్ని సంప్రదించాలని పలమనేరు నియోజకవర్గంలో పనిచేస్తున్న గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 వరకు పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు స్థానిక ఎన్జీవో హోంలో ఆయన్ను కలిశారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించకుండానే జిల్లాస్థాయి, డివిజిన్ స్థాయి , మండలస్థాయి అధికారులు తమపై తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. సర్వేలకు గడువు సైతం ఇవ్వకుండా ఒకవైపు, ప్రజలు ఓటీపీ చెప్పడానికి విముఖత చూపడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శుల సంఘ నాయకులు సుధాకర్‌రావు, మోహన్‌రాంప్రసాద్, హరి, సురేష్, మహబూబ్‌భాషా, రెడ్డిప్రకాష్‌రెడ్డి, వెంకటరమణ, రాకేష్, బిందు, పలమనేరు, గంగవరం,పెద్దపంజాణి, వి.కోట, బైరెడ్డిపల్లి మండలాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల పీఎఫ్ బకాయిలు జమ చేయాలి



మాట్లాడుతున్న చంద్ర తదితరులు

కుప్పం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల పీఎఫ్ బకాయిలను సంబంధిత ఏజెన్సీ వెంటనే వారి ఖాతాలకు జమ చేయాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసరి చంద్ర డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన జీవోల ప్రకారం వేతనాలు ఇవ్వకుండా కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కుప్పం ప్రభుత్వాస్పత్రిలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షురాలిగా జయభారతి, ఉపాధ్యక్షురాలిగా శంకుంతల, కార్యదర్శిగా సంగీత, ఉప కార్యదర్శులుగా కుప్పమ్మ, తిమ్మరాయలు, కోశాధికారిగా వరలక్ష్మిలు ఎన్నికయ్యారు. సమావేశంలో ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశ్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు చంద్రశేఖర్, కార్మికులు పళణి, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణ మండపానికి విరాళాలు



సోమల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సోమల స్వయంభేశ్వర స్వామి ఆలయానికి అనుబంధంగా నూతన నిర్మాణంలోని శివపార్వతుల కల్యాణ మండపం నిర్మాణానికి పలువురు దాతలు విరాళాలు అందజేసినట్లు ఆలయ ధర్మకర్త బీవీ సోమశేఖర్ తెలిపారు. దొంగిరి అక్కులమ్మ, వెంకటప్పల జ్ఞాపకార్థం వారి కుమారులు గ్రానైట్ పనులకు రూ.లక్ష, 50 బస్తాల సిమెంట్, తువ్వా సుబ్రహ్మణ్యంశెట్టి, వరదం మంజుల దంపతులు రూ. 25 వేలు, సింగంశెట్టి లక్ష్మమ్మ, శిద్దప్ప జ్ఞాపకార్థం రత్నమ్మ రూ. 20 వేలు, చిన్నిన్నిగారి కన్నయ్య రూ.12 వేలు, శెట్టివారి చంద్రశేఖర్ రెడ్డి జ్ఞాపకార్థం కుమారుడు సుధాకర్ రూ.11 వేలు, కంచెర్ల యుగంధర్ రూ. 10,116, రాగ్గారి కృష్ణమూర్తి రూ.5116, కోడూరు లక్ష్మీనారాయణ శాస్త్రి జ్ఞాపకార్థం కుమారుడు రాము రూ.5 వేలు, గన్నా రామచంద్రయ్య రూ. 5 వేలు విరాళం అందజేశారు. కల్యాణ మండపంలో విద్యుత్ పరికరాలు ఏర్పాటుకు శెట్టివారి సురేంద్రబాబు, దొంగిరి శంకరయ్య విరాళాలు అందజేసినట్లు ధర్మకర్త తెలిపారు.

ఆధ్యాత్మిక గ్రంథాల పంపిణీ



అర్బన్ కాలనీలో ఆధ్యాత్మిక గ్రంథాలు పంచిపెడుతున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

కుప్పం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక కుప్పం కమిటీ అధ్యక్షుడు కృష్ణ ప్రకాశ్ ఆధ్వర్యంలో కుప్పం పురపాలక సంఘం అర్బన్, ఫిషర్ కాలనీల్లో ఆదివారం ప్రబోధానంద యోగీశ్వరస్వామివారు రచించిన 100 ఆధ్యాత్మిక గ్రంథాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా త్వరలో రాబోయే ఉగాది పండుగ గొప్పదనాన్ని, పర్వం జరుపుకోవడం వెనుక ఉన్న ఆధ్యాత్మిక రహస్యాన్ని వివరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు ప్రకాశ్, శరవణ, కృష్ణమూర్తి, రాజకుమార్, దేవరాజు, శివకృష్ణ, వెంకటలక్ష్మి, పూజ, మైత్రి తదితరులు పాల్గొన్నారు.

నేడు కడా పీడీ గ్రీవెన్స్ డే

కుప్పం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండల సచివాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కడా కార్యాలయ అధికారులు తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొనే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించి అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్యాలయ అధికారులు తెలిపారు.

ఉచితంగా కంటి వైద్యసేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రామకుప్పం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా అం. దత్వ నివారణ సంస్థ, కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల ఆసుపత్రి, వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రామకుప్పంలో నిర్వహించిన ఉచిత కంటి చికిత్స శిబిరంలో 50మంది రోగులకు చికిత్సలందించారు. 11 మంది రోగులను మెరుగైన వైద్య సేవల కోసం పీఈఎస్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు హర్షితరెడ్డి, బాలాజీ, వెంకటేశ్, ఆలయ అభివృద్ధి కమిటీ పెద్దలు సీతాపతి పాల్గొన్నారు.

నిరుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న మైనారిటీ యువత

సోమల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నంజంపేటలో నిరుపేద కుటుంబాలకు పలురకాల నిత్యావసర సరుకులను ఆదివారం మైనార్టీ యువత పంపిణీ చేసింది. ప్రతి నెలా నిరుపేద కుటుంబాలకు అందజేయడమే ధ్యేయంగా భావించి నిత్యావసర సరుకులు అందజేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అస్లాం, మహబూబ్‌బాషా, రియాజ్, రిజ్వాన్, అష్రఫ్ అలీ, ఖయ్యాం తదితరులు పాల్గొన్నారు.

18, 19 తేదీల్లో ఆదరణ పథకంపై శిక్షణ

శాంతిపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : బీసీ వృత్తి కళాకారులకు ఆదరణ పథకంలో రాయితీ పరికరాలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని.. పథకంలో లబ్ధి పొందేందుకు ఈనెల 19న జిల్లా కేంద్రంలో జరిగే శిక్షన కార్యక్రమానికి హాజరు కావాలని ఎంపీడీవో కుమార్ తెలిపారు. 18వ తేదీన నాయీబ్రాహ్మణ, మ్యూజికల్స్, బుట్టల తయారీ, కంసలి, వడ్రంగి, మత్సకారులు, స్వర్ణకారులు, కుమ్మరి, పాల వ్యాపారులకు, 19న రజక, రాతి కార్మికులు(శిల్పి), భవన నిర్మాణదారులు, టైలరింగ్, కల్లు గీత, చేనేత ఇతర కళాకారులకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. కళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థినులకు పరీక్షా సామగ్రి వితరణ



ప్యాడ్లు అందుకున్న విద్యార్థినులతో మహతి ఫౌండేషన్ నిర్వాహకులు

బైరెడ్డిపల్లె, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో పదోతరగతి విద్యార్థినులకు ఆదివారం బైరెడ్డిపల్లె మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మహతి ఫౌండేషన్ ప్రతినిధులు శాంతమ్మ, బుజ్జి, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా నలగుండ్రాయస్వామి వసంతోత్సవం



పూజలందుకున్న నలగుండ్రాయస్వామి

బైరెడ్డిపల్లె, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడపనత్తం గ్రామంలో కొలువై వున్న నలగుండ్రాయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వసంతోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త మురళీస్వామి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను బలోపేతం చేయాలి



పుంగనూరు రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్‌ను బలోపేతం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సంఘ్ ప్రధాన వక్త జనార్ధన్ పేర్కొన్నారు. శత వసంతం సందర్భంగా ఆదివారం స్థానిక అన్నా క్యాంటీన్ నుంచి రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ ప్రతినిధులు, కార్యకర్తలు బీఎంఎస్‌క్లబ్ వరకు కవాత్ నిర్వహించారు. బీజేపీ నేత అయూబ్‌ఖాన్, ప్రతినిధులు గణేశ్, త్రిమూర్తిరెడ్డి, వినాయక్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తం.. గడ్దూరు కాలనీ రోడ్లు

● కాలువల్లేక వీధులపైనే మురుగునీరు ● దోమలతో రోగాల బారిన స్థానికులు
● అవస్థలు పడుతున్న గ్రామస్థులు ● పట్టించుకోని అధికారులు, నాయకులు



పలమనేరు మున్సిపాలిటీలోని గడ్దూరు ఇందిరమ్మ కాలనీలో రోడ్ల దుస్థితి

పలమనేరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీ పాలకవర్గాల నిర్లక్ష్యానికి, ఇక్కడి మున్సిపల్ అధికారుల అలక్ష్యానికి గడ్దూరు కాలనీ అద్దం పడుతోంది. వైఎస్ ఆర్ హయాంలో గ్రామ పంచాయతీ స్థాయి నుంచి మున్సిపాలిటీగా పలమనేరు మార్పు చెందింది. దీంతో మున్సిపాలిటీలోని ఇళ్ల లేని పేదల కోసం గంటావూరు వద్ద సుమారు 90 ఎకరాలు, గడ్దూరు గ్రామం వద్ద మరో 40 ఎకరాల మేర ప్రభుత్వం భూములు కొనుగోలు చేసి లేఅవుట్లు వేసింది. ఈ లేఅవుట్లలో దాదాపు 3 వేల మందికి పైగా పేదలకు నివేశస్థలాలు మంజూరు చేసింది. ఇందులో సింహభాగం రాజకీయ ఒత్తిడిల మేరకు అప్పట్లో అధికారులు స్థానికేతరులకు, అనర్హులకు నివేశ స్థలాలు మంజూరు చేశారు. ప్రభుత్వం నివేశ స్థలాలు ఇచ్చిన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు సైతం మంజూరు చేసింది. విశాలమైన రోడ్లు వేసి ప్రజోపయోగం కోసం ఈ కాలనీలో పలుచోట్ల అధికారులు స్థలాలను రిజర్వు చేసి ఉంచారు. ఈ కాలనీలు ఏర్పాటు చేసి మూడు పాలక వర్గాలు మారినా నేటికీ ఈ కాలనీల్లో నివాసమున్న వారికి కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేకపోయారు. దాదాపు 130 ఎకరాల స్థలంలో ఏర్పడిన గంటావూరు, గడ్దూరు కాలనీల్లో వీధిదీపాలు, అరకొర తాగునీటి సౌకర్యాలను మాత్రమే మున్సిపాలిటీ ఇప్పటి వరకు కల్పించగలిగింది. ఇందులో గంటావూరు కాలనీలో 2018 లో అప్పటి తెలుగుదేశ ం ప్రభుత్వ హయాంలో కనీసం కొన్ని వీధుల్లో అయినా అప్పటి పరిశ్రమలశాఖ మంత్రి అమరనాథరెడ్డి చొరవతో సిమెంటు రోడ్లు వేశారు. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో ఈ కాలనీల గురించి పట్టించుకొన్న నాథుడే లేరు. గడ్దూరు కాలనీలో మాత్రం ఇప్పటివరకు ఒక్క వీధికీ సిమెంటు రోడ్డుగాని, మురుగునీటి కాలువలు నిర్మించకపోవడంతో ఈ కాలనీలోని పలువీధుల్లో మురుగునీరు వీధులపై ప్రవహిస్తోంది. పలువురు తమ ఇళ్ల ముందు మురుగునీటి గుంతలు తవ్వుకొని అందులో మురుగునీటిని మళ్లిస్తున్నారు. దీంతో ఈ కాలనీలో మురుగునీటి నిల్వల కారణంగా దోమలు అధికమై తరచూ కాలనీ వాసులు రోగాల బారిన పడుతున్నారు. మున్సిపాలిటీలో ఉన్న నిధులు సైతం ఈ కాలనీల్లో అధికారులు, పాలక వర్గం ఎందుకు ఖర్చుచేయడం లేదని కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలో మాత్రం ఈ దశాబ్ద కాలంలో వేసిన రోడ్లపైనే మళ్లీ మళ్లీ సీసీరోడ్లు వేస్తున్నారని, సీసీరోడ్లపై మళ్లీ బీటీ రోడ్లు వేస్తున్నారని, బాగున్న మురుగునీటి కాలువలను తవ్వి మళ్లీ మళ్లీ మురుగునీటి కాలువలు నిర్మిస్తున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. గడ్దూరు కాలనీలోని రోడ్లపై పిచ్చిమొక్కలు మొలిచి నడిచేందుకు సైతం వీలు లేకుండా ఉన్నాయని, కనీసం మున్సిపల్ అధికారులు, పాలక వర్గం తమ కాలనీలో ఉన్న రోడ్లను కనీసం చదును చేయలేదని వాపోతున్నారు. ఇకనైనా పాలకవర్గం, మున్సిపల్ అధికారులు స్పందించి తమ కాలనీ దుస్థితి పట్టించుకోవాలని కోరుతున్నారు.

రాయితీపై మామిడి రైతులకు కవర్లు



శాంతిపురం: కవర్లను అందిస్తున్న వింధ్య

రామకుప్పం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు ప్రభుత్వం యాభై శాతం సబ్సిడీతో మామిడికాయల కవర్లను అందిస్తోందని ఉద్యాన అధికారి ప్రియ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో రైతుకు ఎకరాకు 3 వేల కవర్లు, గరిష్ఠంగా 2.5 ఎకరాలకు 9 వేల కవర్లు అందించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కవర్లు కావాల్సిన రైతులు తమ ఆధార్, పట్టాదారు పాసుపుస్తకాలు ఒరిజినల్, జిరాక్స్‌లు తీసుకొచ్చి ఒక్కో కవరుకు రూ.1 చెల్లించి పొందవచ్చని ఆమె తెలిపారు. కవర్లు కావాల్సిన కుప్పం, రామకుప్పం మండలాల రైతులు బందార్లపల్లె, రామకుప్పం రైతు భరోసా కేంద్రాలను సందర్శించాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్‌నంబరు 7731881596 ను సంప్రదించాలని ఆమె కోరారు.

● శాంతిపురం: మామిడి తోటలను పూత దశ నుంచే కాపాడుకోవాలని.. కాయ దశలో వాటి సరైన రక్షణ లేకుంటే దిగుబడి తగ్గిపోతుందని మండల ఉద్యాన అధికారిణి వింధ్య సూచించారు. ఆదివారం శాంతిపురం ఉద్యానశాఖ కార్యాలయంలో మామిడి రైతులకు రాయితీ కవర్లను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పురుగు నుంచి కాయలను కాపాడుకునేందుకు ప్రభుత్వం మామిడి రైతులకు రాయితీపై కాయలకు కట్టేందుకు కవర్లను అందిస్తుందన్నారు. కాయలకు కవర్లు కట్టడంతో నాణ్యత పెరిగి మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందని తెలిపారు. కావాల్సిన రైతులు ఆధార్, పాసుపుస్తకం జిరాక్స్ రిజినల్ పుస్తకాలతో సంప్రదించాలన్నారు. గుడుపల్లె, శాంతిపురం రైతులు అబకలదొడి సచివాలయంలో సంప్రదించాలని కోరారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాల పరిశీలన



శాంతిపురం: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో చంద్రశేఖర్

శాంతిపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఎంఈవో చంద్రశేఖర్ ఇతర అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన శాంతిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాళ్లబూదుగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తుమ్మిశి ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రాలలో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రతి కేంద్రంలోనూ సీసీ కెమెరాలు, విద్యార్థులకు అవసరమైన బల్లలు, ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. శాంతిపురం మండలంలో ఏరాటు చేసిన కేంద్రాలలో సుమారు 728 విద్యార్థులు పరీక్షలు రాస్తారని, వీరితో పాటు రామకుప్పం మండలం చెల్దిగానిపల్లె ఉన్నత పాఠశాలలో చదువుతున్న కొంత మంది పదో తరగతి విద్యార్థులు ఈ కేంద్రాలలో పరీక్షలు రాయనున్నారని ఎంఈవో తెలిపారు.

● చౌడేపల్లె: పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈవో కేశవరెడ్డి పేర్కొన్నారు. అన్ని హైస్కూల్ విద్యార్థులకు స్థానిక హైస్కూల్‌లో పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. కేంద్రంలో తాగునీరు, లైటింగ్, వైద్యసేవలు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

పొట్టి శ్రీరాములుకు నివాళులు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్యులు



పుంగనూరులో ఆర్యవైశ్య సంఘ నాయకుల నివాళులు

పలమనేరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆర్యవైశ్యులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పొట్టిశ్రీరాములు బజారు వీధిలోని ఏటీఎం సెంటరు వద్ద పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. సత్యప్రకాష్, నరేంద్ర, వాసవి క్లబ్ వనిత సభ్యులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

● పుంగనూరు రూరల్: పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను పుంగనూరులోని ఆర్యవైశ్య సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక దోబీ ఘాట్ కాలనీలోని వృద్ధాశ్రమంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ క్లబ్ జోన్ కృష్ణమూర్తి, వాసవిక్లబ్ అధ్యక్షుడు అమరావతి రామ్‌కుమార్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణకు ఘన నివాళి



మృతదేహంపై టీడీపీ జెండా కప్పుతున్న చల్లా రామచంద్రారెడ్డి



పలమనేరు డీఎస్పీ ప్రభాకర్‌తో మాట్లాడుతున్న చల్లా

పుంగనూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణాపురంలో వైసీపీ కార్యకర్త వెంకటరమణ చేతిలో హత్యకు గురైన టీడీపీ కార్యకర్త కాగతి రామకృష్ణ అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామంలో జరిగాయి. చల్లా రామచంద్రారెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో పాటు పలువురు టీడీపీ నాయకులు అంత్యక్రియలకు హాజరై నివాళులు అర్పించారు.



రామకృష్ణ కుమారులను ఓదారుస్తున్న చల్లా , షాజహాన్‌బాషా

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



జయప్ప (ఫైల్ ఫొటో)

కుప్పం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శాంతిపురం మండలం సొన్నేగానిపల్లెకు చెందిన జయప్ప (60) అనే వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. సొంత గ్రామం నుంచి పనులు నిమిత్తం కుప్పం వచ్చిన జయప్ప పనులు ముగించుకుని గ్రామానికి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలో సామగుట్టపల్లె సమీపంలో పలమనేరు నుంచి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఆయన ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో జయప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. కుప్పం అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జయప్ప మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వాసుపత్రికి చేర్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

19న వారపు సంత బహిరంగ వేలం

పుంగనూరు రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19న మున్సిపల్ పరిధిలోని దినసరి కూరగాయల సంత, వారపుసంత, ప్రైవేటు వాహనాల ఫీజుల వసూళ్లు, పుంగమ్మ చెరువు కట్టపై ఉన్న పబ్లిక్ మరుగుదొడ్డి తదితర నిర్వహణకు బహిరంగ వేలం వేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. 19న ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన గుత్తేదారులు మున్సిపల్ నిబంధనల మేరకు డిపాజిట్లు చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

కొండకు నిప్పు.. పీవీసీ పైపుల దగ్ధం

సోమల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఇరికిపెంట సమీపంలోని మధురమలై కొండకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు పొలాల వైపు మళ్లడంతో పలువురు రైతులకు పంట నష్టం జరిగింది. మేటిమంద శివయ్యనాయుడు పొలం వద్ద టమోటా పంటకు అమర్చిన పలు పీవీసీ పైపులు, టమోటా తోటకు వేసిన కర్రలు అగ్నికి ఆహుతయ్యాయి. మంటలు ఆర్పేందుకు రైతులు పలు ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని రైతులు వాపోయారు. ఉద్యానశాఖ అధికారులు, వ్యవసాయ అధికారులు రైతులను ఆదుకోవాలని మాజీ సర్పంచ్ శ్రీనివాసులు నాయుడు కోరారు. జిల్లా అధికారులకు వినతులు అందజేసినట్లు తెలిపారు.

23న పైనేని మునెమ్మ స్మారక పురస్కారాల ప్రదానం

గంగవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23న ఆదివారం ఎస్.ఆర్.పురం మండలం అరిమాకులపల్లెలో తెలుగు తల్లి కళా ప్రాంగణంలో పైనేని మునెమ్మ స్మారక పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాధం నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పైనేని మునెమ్మ జ్ఞాపకార్థం కథల పోటీలు నిర్వహించగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్నారన్నారు. వారందరి కవితలను పరిగణలోకి తీసుకొని ప్రతిభ కనబరచిన వారికి పైనేని మునెమ్మ పరస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు.

పుంగనూరు ఇన్‌చార్జి సీఐగా రాంభూపాల్

పుంగనూరు రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్ పుంగనూరు ఇన్‌చార్జి అర్బన్ సీఐగా ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ శ్రీనివాసులు సస్పెండ్ కావడంతో పుంగనూరు రూరల్ సీఐకి జిల్లా ఎస్పీ బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

శ్రీవారికి తిరుప్పావడ సేవ

పుంగనూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన ఆదివారం శ్రీవారికి మహాశాంతి అభిషేకం, తిరుప్పావడ సేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. వెంకటేశ్వరస్వామి కీర్తనలతో ఆలయం భక్తిపారవశ్యమైంది. రాత్రి శయనోత్సవం చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు, ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వందేళ్ల చింతచెట్టు నరికివేత



శ్రీరంగరాజపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా ఉన్న చింతచెట్టును నరికివేయడంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం మేరకు సీకే.పురం సమీపంలోని చెరువు కట్టపై వందేళ్ల వయసున్న భారీ చింత చెట్టును గ్రామానికి చెందిన గణపతి శనివారం రాత్రి నరికివేశాడు. ఎలాంటి అనుమతి పొందకుండానే నరికివేయడంతో స్థానికుల వీఆర్వో చంద్రబాబుకు తెలియజేశారు. గణపతి, అతనికి సహకరించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎంఆర్సీ భవనంలో భయం..భయం



పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన భవనపైకప్పు

యాదమరి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండల వనరుల కేంద్ర భవనంలోని స్లాబ్ పైకప్పు సిమెంట్ పెచ్చులూడింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గతంలో నిర్మించిన పాత భవనాన్ని మండల విద్యాశాఖ అధికారులు ఎంఆర్సీ కేంద్రంగా ఉపయోగిస్తున్నారు. మండల పరిధిలోని పాఠశాలలకు సంబంధించిన రికార్డులు, ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందజేసే పాఠ్యపుస్తకాలు, మెటీరియల్‌ను ఇక్కడ భద్రపరుస్తారు. భవనం చాలా పాతబడిపోయింది. నిర్వహణ కొరవడింది. అక్కడక్కడా గోడలు నెర్రలు చీలాయి. శ్లాబ్ పైకప్పు సిమెంట్ పెచ్చులూడుతోంది. వర్షం వస్తే నీటి లీకేజి కారణంగా దెబ్బతింది. ప్రమాదం సంభవించకముందే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాల్సివుంది.

లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో పూజలు



బెల్లం ముద్దలను సమర్పిస్తున్న భక్తులు

గంగాధరనెల్లూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వేపంజేరిలో లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. రాయచోటి ఏఎస్ఐ గణేష్‌కుమార్ తులభారం మొక్కును తీర్చుకున్నారు. ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన తన బరువుకు సమానంగా తెల్లబెల్లాన్ని తూకం వేసి ఆలయానికి సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, దామోదరం, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నుల పంపిణీ



చిత్తూరు సిటీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్, తానా ఆధ్వర్యంలో ప్యాడ్‌లు, పెన్నులను ఉచితంగా అందజేశారు. ఆదివారం 3వ డివిజన్ 75 దొడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐలు రవితేజ, సునీల్, పార్టీ టీడీపీ నేతలు గోపాలకృష్ణన్, నళిని, జయశంకర్, చంద్రశేఖర్, కాశి, దనరాజ్, కుమార్, హెచ్ఎం సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ లత

వెదురుకుప్పం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో ఆదివారం సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ లత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్వేటినగరంలోని మూర్తిరాజు వీధిలో రూ.5లక్షల నిధులతో సిమెంటు పనులు చేపడుతున్నామన్నారు. సర్పంచ్ ధనంజయవర్మ, వార్డుమెంబరు అంబిక, వైసీపీ రాష్ట్ర కార్యవర్గ ప్రధాన కార్యదర్శి బాలాజీ పాల్గొన్నారు.

బావుల్లో పడేస్తున్నగ్రానైట్ వ్యర్థాలు



గుడిపాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంతమంది గ్రానైట్ యజమానులు పాడుబడ్డ బావులు, పట్టాలో వున్న బావుల్లో రాత్రికి రాత్రే టిప్పర్ల ద్వారా గ్రానైట్ వ్యర్థాలను పడేస్తున్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. చీలాపల్లి క్రాస్ నుంచి పేయనపల్లి వెళ్ళే రహదారిలో ఎక్కడపడితే అక్కడ గ్రానైట్ వ్యర్థాలను పడేస్తున్నారు. ఈ చర్యల కట్టడికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ట్రేడ్ లైసెన్స్ బకాయిలపై ఫేక్‌కాల్స్ నమ్మొద్దు

చిత్తూరు అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): దుకాణాల ట్రేడ్ లైసెన్స్ బకాయిలను ఆన్‌లైన్‌లో చెల్లించాలంటూఏపీ మున్సిపల్ అధికారుల పేరుతో కొందరు మోసానికి పాల్పడుతున్న వైనం మున్సిపల్ అధికారుల దృష్టికి వచ్చింది. ఇలాంటి ఫేక్ కాల్స్‌పై ట్రేడ్ లైసెన్స్‌దారులు అప్రమత్తంగా వ్యవహరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహప్రసాద్ ఒక ప్రకటనలో సూచించారు. ట్రేడ్ లైసెన్స్ బకాయిల కోసం తమ కార్యాలయం నుంచి ఎవరూ ఫోన్ చేయరన్నారు. ట్రేడ్ లైసెన్స్‌దారులకు 9080329172, 7670906441 నంబర్ల నుంచి ఆన్‌లైన్ పేమెంట్ చేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నంబర్లపై పోలీసు అధికారులకు ఇచ్చామన్నారు. వార్డు సచివాలయాల్లో, నగరపాలక కార్యాలయంలో, పురసేవా కేంద్రంలో బకాయిలు చెల్లించి రసీదులు పొందాలన్నారు. బిల్లులను ఆన్‌లైన్ పేమెంట్ చేయమని ఫోన్ చేస్తే స్పందించవద్దని కమిషనర్ సూచించారు.

పదకొండు సీట్లకే పరిమితం చేసినా బుద్ధి రాలేదు: టీడీపీ

గుడిపాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): హత్యా రాజకీయాలకు విసిగి 11 సీట్లు ఇచ్చినా వైసీపీ నాయకులకు బుద్ధి రాలేదని జీజేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు విమర్శించారు. ఆదివారం వారు వేర్వేరుగా మీడియాతో మాట్లాడుతూ పుంగనూరులోని టీడీపీ నేత రామకృష్ణను వైసీపీ వ్యక్తి హత్య చేయడం దారుణమన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ పక్కదారి పట్టాయన్నారు. తమ ప్రభుత్వం ప్రక్షాళన చేస్తూ వ్యవస్థలను దారిలో పెడుతోందన్నారు. ఉనికి కాపాడుకోవడానికి వైసీపీ నాయకులు ఎన్ని జిమ్మిక్కులు చేసినా పప్పులు ఉడకవన్నారు. టీడీపీ నాయకులు హరిబాబు నాయుడు, హరి యాదవ్, రవి నాయుడు, లోకనాథం నాయుడు జ్యోతీశ్వర్, ఎన్‌టీ నాయుడు, బీమా, కేబీ బాబు, మణి మొదలియార్, సురేష్ నాయుడు, జయచంద్ర నాయుడు, బోడెబ్బ నాయుడు పాల్గొన్నారు.

23న మునెమ్మ స్మారక పురస్కారాల ప్రదానం

గంగవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23న ఆదివారం ఎస్.ఆర్.పురం మండలం అరిమాకులపల్లెలో తెలుగు తల్లి కళా ప్రాంగణంలో పైనేని మునెమ్మ స్మారక పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాదం నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పైనేని మునెమ్మ జ్ఞాపకార్థం కథల పోటీలు నిర్వహించగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్నారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి పైనేని మునెమ్మ పరస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్‌ఎస్‌ఎస్‌ను బలోపేతం చేయాలి



పుంగనూరు రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్‌ను బలోపేతం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సంఘ్ ప్రధాన వక్త జనార్థన్ పేర్కొన్నారు. శత వసంతం సందర్భంగా ఆదివారం స్థానిక అన్నా క్యాంటీన్ నుంచి రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ ప్రతినిధులు, కార్యకర్తలు బీఎం ఎస్‌క్లబ్ వరకు కవాత్ నిర్వహించారు. బీజేపీ నేత అయూబ్‌ఖాన్, ప్రతినిధులు గణేశ్, త్రిమూర్తిరెడ్డి, వినాయక్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరపాలక కార్యాలయంలో పీజీఆర్ఎస్

చిత్తూరు అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయ ఆవరణలో జరిగే కార్యక్రమంలో ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరిస్తామన్నారు. అధికారులంతా తప్పకుండా హాజరుకావాలని ఆయన ఆదేశించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం

విజయపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్టు ఎంఈవో హరిప్రసాద్‌వర్మ తెలిపారు. మండలంలో పన్నూరు, విజయపురం ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలున్నాయన్నారు. పన్నూరులో 61 మంది, గంగమాంబాపురం నుండి 12 మంది, విజయపురంలో 48 మంది, జంబాడలో 27 మంది, శ్రీహరిపురంలో 29 మంది విద్యార్థులు సోమవారం నుంచి పరీక్షలు రాస్తున్నారని ఆయన వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

గుడిపాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు- వేలూరు జాతీయ రహదారిలో ఆదివారం రాత్రి బైకు నుంచి కిందపడి ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతికి చెందిన విష్ణు, సాయిలు ఆదివారం పనులు ముగించుకుని తిరిగి తిరుపతికి వెళ్తుండగా లక్ష్మీపురం వద్ద కుక్క అడ్డం వచ్చింది. దానిని తప్పించబోయి వాహనం బోల్తా పడింది. దీంతో వారిరువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మూడు ఇసుక లారీల సీజ్



పల్లూరు వద్ద పట్టుబడిన ఇసుక లారీ

గుడిపాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు లారీలను సీజ్ చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తమిళనాడు సరిహద్దులోని గొల్లమడుగు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా నెల్లూరు నుంచి తమిళనాడుకు మూడు లారీల్లో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. లారీలను సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

18, 19 తేదీల్లో ఆదరణ పథకంపై శిక్షణ

శాంతిపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : బీసీ వృత్తి కళాకారులకు ఆదరణ పథకంలో రాయితీ పరికరాలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని.. పథకంలో లబ్ధి పొందేందుకు ఈనెల 19న జిల్లా కేంద్రంలో జరిగే శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని ఎంపీడీవో కుమార్ తెలిపారు. 18వ తేదీన నాయీబ్రాహ్మణ, మ్యూజికల్స్ బుట్టల తయారీ, కంసలి, వడ్రంగి, మత్స్యకారులు, స్వర్ణకారులు, కుమ్మరి, పాల వ్యాపారులకు, 19న రజక, రాతి కార్మికులు(శిల్పి), భవన నిర్మాణదారులు, టైలరింగ్, కల్లు గీత, చేనేత ఇతర కళాకారులకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. కళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



జయప్ప (ఫైల్ ఫొటో)

కుప్పం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శాంతిపురం మండలం సొన్నేగానిపల్లెకు చెందిన జయప్ప (60) అనే వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. సొంత గ్రామం నుంచి పనులు నిమిత్తం కుప్పం వచ్చిన జయప్ప పనులు ముగించుకుని గ్రామానికి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలో సామగుట్టపల్లె సమీపంలో పలమనేరు నుంచి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఆయన ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో జయప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. కుప్పం అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జయప్ప మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి చేర్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కొమరగుంటలో జల్లికట్టు సందడి

పశువుల నిలువరింతకు పోటీపడిన యువకులు



గ్రామంలో పశువులను నిలువరించేందుకు ఉత్సాహపడుతున్న యువకులు

వెదురుకుప్పం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): కొమరగుంటలో ఆదివారం ఉత్సాహంగా జల్లికట్టు జరిగింది. ముందస్తు సమాచారంతో వివిధ ప్రాంతాల నుంచి గిత్తలతో యజమానులు పాల్గొన్నారు. భారీగా జనం తరలి వచ్చారు. ఊరిలో అల్లిని ఏర్పాటు చేశారు. గిత్తలకు వివిధ రాజకీయ పార్టీల నాయకుల, ఇతర ఫొటోలతో కూడిన పట్టీలను కట్టి అల్లివైపు వదిలారు. అప్పటికే సిద్ధంగా ఉన్న యువకులు గిత్తలను నిలువరించే ప్రయత్నం చేశారు. కొందరు పట్టీలను దక్కించుకున్నారు. పశువుల నిలువరింతలో కింద పడ్డ కొంతమంది యువకులకు స్వల్ప గాయాలయాయి. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గురుసాల కిషన్‌చంద్, వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బట్టే చాణిక్య ప్రతాప్, టీడీపీ నాయకులు మునిరాజారెడ్డి, ముని, సుధాకర్‌రెడ్డి, మారేపలి మురళి, బీజేపీ నేత విజయకుమార్‌రెడ్డి తదితరులు అన్నం ప్యాకెట్లను అందజేశారు. జల్లికట్టు నిర్వహణకు ముందుగా ప్రభుత్వ విప్, డాక్టర్ వీఎం థామస్ ఫొటో పట్టీని ప్రదర్శించారు.



పశువుకు కట్టిన పట్టీని సొంతం చేసుకోడానికి ప్రయత్నం



వీధుల్లో పరుగులు తీస్తున్న పశువులు

కళాశాల భవన నిర్మాణం కలేనా...!

●స్థలం కేటాయించినా ఇప్పటివరకూ పడని పునాదిరాయి

వెదురుకుప్పం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి ముందడుగు పడటంలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో డిగ్రీ కళాశాల మంజూరయింది. 2020-21 విద్యా సంవత్సరంలో తాత్కాలికంగా చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దీనిని ప్రారంభించారు. ఇప్పటికీ కళాశాల అందులోనే కొనసాగుతోంది. ఉదయం జూనియర్ కళాశాల, మధ్యాహ్నం నుంచి డిగ్రీ కళాశాల తరగతులను నిర్వహిస్తున్నారు. వసతుల కొరత వెంటాడుతున్న ఈ భవనంలో రెండు కాలేజీల నిర్వహణ కష్టంగా మారింది. గతంలో ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఫలితం లేకపోయింది.

ఆదికి ముందే వైఎస్సార్ విగ్రహం

డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి 2020 మే21న కొమరగుంటలో 8ఎకరాల 44 సెంట్లు కేటాయించారు. రూ.15లక్షలతో నిర్మాణ పనులు చేపడతామని అప్పటి ప్రభుత్వ పెద్దలు చెప్పారు. కానీ ఇప్పటి వరకు పునాది రాయి కూడా పడలేదు. భవనం నిర్మించకుండానే అక్కడి స్థలంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని మాత్రం నిర్మించేశారు. విద్యార్థుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని. ప్రభుత్వ విప్ థామస్ చొరవ చూపించి భవనాన్ని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



డిగ్రీ కళాశాల స్థలంలో వైఎస్ఆర్ విగ్రహం ఏర్పాటు

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది



జీడీనెల్లూరులో శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అధికారులు

గంగాధరనెల్లూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర సాధనకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని ఎంపీడీవో మారం హరిప్రసాద్‌రెడ్డి, ఎంఈవో కాణిపాకం ఆంజినేయులు శెట్టి, సీడీపీవో గుండ్లపల్లె వినత్రీ అన్నారు. శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం గంగాధరనెల్లూరు ఎంపీడీవో మీటింగ్ హాలులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అధికారులు నివాళులు అర్పించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములును ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



చిత్తూరులో శ్రీరాములు విగ్రహం వద్ద నేతల నివాళి

చిత్తూరు సెంట్రల్: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక వినాయకపురంలోని గంగినేని చెరువు కట్టపై పొట్టి శ్రీరాముల విగ్రహానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన జయంతిని సందర్భంగా రాష్ట్ర ఏర్పాటుకు చేసిన సేవలను కొనియాడారు.

అశ్వవాహనంపై లక్ష్మీనరసింహుడి దివ్యతేజం

● ఘనంగా పార్వేట వేడుకలు



పార్వేట వేడుకను ప్రారంభిస్తున్న అర్చకులు

కల్లూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు ఆదివారం అశ్వవాహనంపై స్వామి అమ్మవార్లు నాలుగు మాడ వీధుల్లో విహరించారు. ఆలయంలో ఉదయం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకృతుడైన స్వామివారు పురవీధుల్లో ఊరేగారు. వాహనం ముందు కోలాటాలు, భజనలు నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీ నరసింహస్వామి ప్రత్యేక వాహనంపై ఆసీనులై మంగళవాయిద్యాలు నడుమ పార్వేట మండపానికి చేరుకున్నారు. అక్కడ స్వామివారికి ఆరాధన, హారతులిచ్చారు. సాంప్రదాయబద్ధంగా ఆలయ ప్రధాన అర్చకులు అనంతకుమారాచార్యులు పార్వేట వేడుకను ప్రారంభించారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అశ్వవాహనం, పార్వేట ఉభయదారులుగా కమ్మసంఘం వ్యవహరించారు. అన్నదానం చేపట్టారు. వేడుకల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సర్వేలతో ఒత్తిడికి గురవుతున్నామని ఆవేదన



వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పలమనేరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నిత్యం ఏదో ఒక సర్వే చేయాలని ప్రభుత్వం నుంచి వస్తున్న ఆదేశాల మేరకు జిల్లా, మండలస్థాయి అధికారులు తమపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారని.. అనేక మంది అనారోగ్యం పాలవుతున్నామని ఆదివారం పలమనేరు ఎన్జీవో సంఘ అధ్యక్షులు ఆనందబాబుకు వినతి పత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వాన్ని సంప్రదించాలని పలమనేరు నియోజకవర్గంలో పనిచేస్తున్న గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 వరకు పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు స్థానిక ఎన్జీవో హోంలో ఆయన్ను కలిశారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించకుండానే జిల్లాస్థాయి, డివిజన్ స్థాయి , మండలస్థాయి అధికారులు తమపై తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. సర్వేలకు గడువు సైతం ఇవ్వకుండా ఒకవైపు, ప్రజలు ఓటీపీ చెప్పడానికి విముఖత చూపడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శుల సంఘ నాయకులు సుధాకర్‌రావు, మోహన్‌రాంప్రసాద్, హరి, సురేష్, మహబూబ్‌భాషా, రెడ్డిప్రకాష్ రెడ్డి, వెంకటరమణ, రాకేష్, బిందు, పలమనేరు, గంగవరం,పెద్దపంజాణి, వి.కోట, బైరెడ్డిపల్లి మండలాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నలగుండ్రాయస్వామి వసంతోత్సవం



అలంకరణలో నలగుండ్రాయస్వామి

బైరెడ్డిపల్లె, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడపనత్తం గ్రామంలో కొలువైవున్న నలగుండ్రాయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వసంతోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త మురళీస్వామి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొండకు నిప్పు పీవీసీ పైపుల దగ్ధం

సోమల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఇరికిపెంట సమీపంలోని మధురమలై కొండకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు పొలాలవైపు మళ్లడంతో పలువురు రైతులకు పంట నష్టం జరిగింది. మేటిమంద శివయ్యనాయుడు పొలం వద్ద టమోటా పంటకు అమర్చిన పలు పీవీసీ పైపులు, టమోటా తోటకు వేసిన కర్రలు అగ్నికి ఆహుతయ్యాయి. మంటలు ఆర్పేందుకు రైతులు పలు ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని రైతులు వాపోయారు. ఉద్యానశాఖ అధికారులు, వ్యవసాయ అధికారులు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మాజీ సర్పంచ్ శ్రీనివాసులు నాయుడు కోరారు. జిల్లా అధికారులకు వినతులు అందజేసినట్లు తెలిపారు.

ఏపీ ఆర్ఎస్ఏ కుప్పం డివిజన్ నూతన సంఘం ఎన్నిక

కుప్పం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఏపీఆర్ఎస్ఏ (ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్) కుప్పం డివిజన్ నూతన సంఘం ఎన్నికలు ఆదివారం కుప్పంలోని ఎన్జీవో హోమ్‌లో జరిగాయి. ఏపీఆర్ఎస్ఏ కుప్పం డివిజన్ అధ్యక్షుడిగా రామకుప్పం డిప్యూటీ తహసీల్దారు ఆర్ఎన్.బాలాజీ, అసోసియేటెడ్ అధ్యక్షులుగా గుడుపల్లె తహసీల్దారు టి.సీతారామ్, ఉపాధ్యక్షులుగా రామకుప్పం తహసీల్దారు కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వి.నారాయణ, కడా ఎంఆర్ఐ జేజే.జోషి, ప్రధాన కార్యదర్శిగా కుప్పం తహసీల్దారు కార్యాలయం వేణుగోపాల్, సంయుక్త కార్యదర్శులుగా కడా కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ దామోదరాచారి, కుప్పం ఆర్డీవో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ చరిత్ నాయుడులు ఎన్నికయ్యారు. ఎన్నికైన వారిని రెవెన్యూ ఉద్యోగులు సత్కరించారు.



ఏపీఆర్ఎస్ఏ నాయకులను సత్కరిస్తున్న ఉద్యోగులు